క్లుప్తంగా

నేటి సదస్సుకు రైతులు తరలిరండి



సదస్సు కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ నారాయణ రెడ్డి

కూడేరు: స్థానిక శివరావు కళ్యాణమంటపంలో మంగళవారం ఉదయం 10 గంటలకు జరిగే రైతు సదస్సుకు తరలిరావాలని హంద్రీనీవా కాలువ పరిరక్షణ కమిటీ సభ్యుడు, ఎంపీపీ నారాయణ రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం మండల పరిధిలోని గ్రామాల్లో రైతులకు కరపత్రాలు అందించారు. కమిటీ సభ్యుడు మాట్లాడుతూ హంద్రీనీవా కాలువకు లైనింగ్ చేస్తే కాలువ పరిసర ప్రాంతాల్లోని రైతులు నష్టపోతారన్నారు. రైతులంతా ఏకమై ముక్తకంఠంతో లైనింగ్ పనులను వ్యతిరేకిస్తే ప్ప ప్రభుత్వం దిగిరాదన్నారు. రైతు సదస్సుకు ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వర రెడ్డి, వివిధ రైతు సంఘాల నేతలు రానున్నట్లు తెలిపారు. పార్టీలకతీతంగా సదస్సుకు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో పరిరక్షణ సమితి సభ్యులు జల్లిపల్లి సిద్ధారెడ్డి, చోళసముద్రం దేవేంద్ర, శ్రీనివాసులు, రామచంద్రారెడ్డి, రంగారెడ్డి, శంకర్ నాయక్, శ్రీకాంత్, సభ్యులు పాల్గొన్నారు.

జలధికి తరలిన మారెమ్మ ఉత్సవ విగ్రహం



జలధి పూజలు అందుకుంటున్న మారెమ్మ

శెట్టూరు: మండలంలోని బసంపల్లికి చెందిన మారెమ్మ ఉత్సవ విగ్రహాన్ని సోమవారం జలధికి తరలించారు. నూతన ఉత్సవ విగ్రహం తయారు చేయించిన గ్రామస్తులు.. ప్రత్యేక పూజలు నిర్వహించి, ప్రతిష్ట చేశారు. శెట్టూరు నోముగడ్డ వంకకు గ్రామదేవత మారెమ్మను ఊరేగింపుగా తీసుకెళ్లారు. సాయంత్రం ఊరేగింపుగా ఆలయంలో పతిష్ఠించారు.

విచ్చలవిడిగా కల్లు అమ్మకాలు



బొమ్మనహాళ్ వద్ద నిర్వహిస్తున్న కల్లు దుకాణం

బొమ్మనహాళ్: మండల కేంద్రంలోని శివారు ప్రాంతంలో అనుమతి లేకుండా విచ్చలవిడిగా కల్లు విక్రయిస్తున్నారు. కర్ణాటక సరిహద్దు ప్రాంతం కావడంతో ఆంధ్రా సరిహద్దులో కల్లు దుకాణాలు వెలిశాయి. అనుమతి లేకుండా దుకాణాలు ఏర్పాటు చేస్తున్నా పట్టించుకునే నాథుడే లేరు. అధికారులు స్పందించి అనుమతులు లేని కల్లు దుకాణాలను మూసేసేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.


సమస్యల పరిష్కారం కోసం రాజీలేని పోరాటం



తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

రాయదుర్గంటౌన్: అంగన్‌వాడీ కార్యకర్తలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం రాజీలేని పోరాటం చేస్తామని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి మల్లికార్జున, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు పిలుపునిచ్చారు. సోమవారం న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ తహసీల్దార్ కార్యాలయం ఎదుట రాయదుర్గం ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలు, సీఐటీయూ నాయకులతో కలిసి ధర్నా చేశారు. సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి మల్లికార్జున మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఎం సీనియర్ నాయకులు నాగరాజు, అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్ల యూనియన్ సెక్రటరీ మేరీ, సెక్టార్ లీడర్లు చంద్రకళ, కృష్ణవేణి, మెహ్రూన్, రుద్రమ్మ, మల్లక్క, రాధిక, శోభ పాల్గొన్నారు.

వైభవంగా వీరబ్రహ్మేంద్రస్వామి రథోత్సవం



బచ్చేహళ్లిలో రథోత్సవ దృశ్యం

శెట్టూరు: మండలంలోని బచ్చేహళ్లిలో వీరబ్రహ్మేంద్రస్వామి రథోత్సవం సోమవారం కనులపండువగా జరిగింది. గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. ఉదయం హోమం అనంతరం సాయంత్రం నిర్వహించిన రథోత్సవానికి చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. మంగళవారం పూల రథోత్సం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

లైనింగ్ పనులు ఆపకపోతే కన్నీరే!

- హంద్రీనీవా లైనింగ్ పనులతో బీళ్లుగా మారనున్న భూములు
- కాంక్రీట్ పనులతో అడుగంటనున్న బోరుబావులు
- కాలువలో నీరు పారితే 10 వేల ఎకరాలకు నీటి వసతి



కరుట్లపల్లి వద్ద లైనింగ్ పనులు చేపట్టేందుకు కాలువ గట్టుపై కంపచెట్లు తొలగించిన దృశ్యం



కూడేరు: పి.నారాయణపురం వద్ద హంద్రీ నీవా కాలువ సమీపంలో సాగు చేసిన చీనీ తోట

కూడేరు: హంద్రీనీవా సుజల స్రవంతి కాలువ లైనింగ్ పనులు ఆపకపోతే రైతులకు కన్నీరు తప్పదు. అతి తక్కువ వర్షం కురిసే కూడేరు మండల రైతాంగానికి హంద్రీనీవా కాలువ ప్రాణప్రదమైంది. వేలాది కుటుంబాలు వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నాయి. కాలువ పారితే నీరు ఇంకిపోయి బోరుబావుల్లో భూగర్భజలాలు పెంపొందుతాయి. తద్వారా ఈ ప్రాంతం సస్యశ్యామలంగా మారుతుంది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత కాలువకు కాంక్రీట్‌తో లైనింగ్ పనులు చేసేందుకు పూనుకున్నారు. తద్వారా బోరుబావులు ఎండిపోయే ప్రమాదం ఉంది. పచ్చని పంట పొలాలు బీళ్లుగా మారే అవకాశం ఉంది. ఫలితంగా వ్యవసాయంపై ఆధారపడిన రైతులు, కూలీలకు కన్నీటి కష్టాలు తప్పవు. ఉపద్రవాన్ని ముందే పసిగట్టిన రైతులు,ప్రజలు పార్టీలకతీతంగా ఏకమై లైనింగ్ పనులు ఆపాలని ముక్తకంఠంతో కోరుతున్నారు. అతితక్కువ వర్షపాతం కురిసే కూడేరు మండలంలో హంద్రీనీవా సుజల స్రవంతి కాలువ గుండా కృష్ణాజలాలు ప్రవహిస్తే భూమిలోకి నీరు ఇంకి కాలువకు ఇరువైపులా కిలోమీటర్ల దూరం భూగర్భ జలాలు పెంపొందుతాయి. ఎంఎంహళ్లి, కరుట్లపల్లి, తిమ్మాపురం, పి.నారాయణపురం, చోళసముద్రం, జయపురం గ్రామాల్లోని సుమారు 10 వేల ఎకరాలకు నీటి వసతి లభిస్తుంది. హంద్రీనీవా కాలువ గుండా ప్రవహించే నీటిపై ఆధారపడి అనేక మంది రైతులు రూ.లక్షలు పెట్టుబడి పెట్టి చీనీ, అరటితో పాటు ఇతర పండ్ల తోటలు, వేరుశనగ మొక్కజొన్నతో పాటు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేశారు.

లైనింగ్ పనులతో రైతాంగానికి తీరని నష్టం..

హంద్రీనీవా సుజల స్రవంతి కాలువకు కాంక్రీట్‌తో లైనింగ్ పనులు చేయిస్తే రైతాంగానికి తీరని నష్టం జరుగుతుంది. లైనింగ్‌తో భూమిలోకి నీరు ఇంకదు. కాలువ రెండు పక్కల ఊట నీరు బయటకు రాదు. భవిష్యత్‌లో కాలువ సామర్థ్యాన్ని పెంచడానికి వీలుండదు. దీంతో హంద్రీ నీవా కాలువకు ఇరువైపులా ఉన్న బోర్లలో నీటి లభ్యత తగ్గిపోయి ఎండిపోయే పరిస్థితి వస్తుంది. సాగు నీరు లేక పంటలు సాగు చేయడానికి వీలులేక బంగారు పంటలు పండే భూములన్నీ బీడుగా మారిపోతాయి. ఫలితంగా వ్యవసాయంపై ఆధారిపడి జీవిస్తున్న రైతులు, కూలీల బతుకులు కష్టాలు పడాల్సి వస్తుంది.

పనులు ఆపాలని రైతులు వేడుకోలు..

లైనింగ్ పనులు చేపడితే తీవ్రంగా నష్టపోతామని పార్టీలకతీతంగా రైతులు ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు. కానీ రైతుల గోడు ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోలేదు. లైనింగ్ పనులు చేయించేందుకు టెండర్లు ఆహ్వానించింది. ఇప్పటికే కరుట్లపల్లి, పి.నారాయణపురం గ్రామాల వద్ద లైనింగ్ పనులు చేయించేందుకుగాను కాలువ గట్లపై పెరిగిన కంప చెట్లను తొలగించారు.

భూములు బీళ్లుగా మారతాయి



హంద్రీ నీవా సుజల స్రవంతి కాలువ సమీపంలో ఐదు ఎకరాల పొలం ఉంది. మూడు బోర్లు వేయించా. రెండు బోర్లు ఫెయిల్ అయ్యాయి. ఒక బోరులో నీరు వస్తోంది. అది కూడా హంద్రీ నీవా కాలువ గుండా నీరు ప్రవహిస్తేనే. ప్రస్తుతం వేరుశనగ పంట సాగు చేశా. లైనింగ్ పనులు చేపట్టాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో భూగర్భ జలాలు అడుగంటి పోతాయి. భూములను బీడుగా పెట్టుకోవాల్సి వస్తుంది.

– రామాంజనేయులు, పి.నారాయణపురం , కూడేరు మండలం

చీనీ పంట కోల్పోవాల్సి వస్తుంది



హంద్రీ నీవా కాలువ పక్కనే 8 ఎకరాల పొలం ఉంది. నాలుగేళ్ల క్రితం ఐదు ఎకరాల్లో చీనీ పంట సాగు చేశా. రూ.లక్షలు పెట్టుబడి అయ్యింది. 3 ఎకరాల్లో వేరుశనగ పంట సాగు చేశా. రూ.లక్ష వరకు వెచ్చించి ఐదు బోర్లు వేయించా. ఒక బోరులో నీరు వస్తోంది. హంద్రీ నీవా కాలువకు లైనింగ్ చేపడితే భూగర్భ జలాలు అడుగంటి ఉన్న బోర్లలో నీరు బంద్ అవుతుంది. దీంతో చీనీ పంటను కోల్పోవాల్సి వస్తుంది. లైనింగ్ పనులు ఆపాలి.

– నారాయణరెడ్డి, రైతు, పి.నారాయణపురం, కూడేరు మండలం

యువతపోరును విజయవంతం చేద్దాం



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ యువనేత వై.భీమిరెడ్డి

వజ్రకరూరు: ఈనెల 12న వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో జరిగే యువత పోరును విజయవంతం చేద్దామని ఎమ్మెల్సీ, ప్రివిలేజ్ కమిటీ చైర్మన్ వై.శివరామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ యువనేత, ఖోఖో అసోసియేషన్ జిల్లా కమిటీ చైర్మన్ వై.భీమిరెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం మండలంలోని కొనకొండ్లలో వారు విలేకరులతో మాట్లాడారు. బుధవారం ఉదయం 10 గంటలకు అనంతపురంలోని జెడ్పీహెచ్ఎస్ వద్దనున్న దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ విగ్రహం నుంచి యువత పోరు ర్యాలీ ప్రారంభమై, సప్తగిరి సర్కిల్, సూర్యనగర్ మీదుగా కలెక్టర్ కార్యాలయం వరకు కొన సాగుతుందని, అక్కడ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమా ను లు, విద్యార్థులు, నిరుద్యోగులు తదితరులు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

పర్యావరణాన్ని పరిరక్షించాలి

కూడేరు: పర్యావరణాన్ని పరిరక్షించాలని ట్రైనీ కలెక్టర్ వినూత్న సూచించారు. సోమవారం మండల పరిధిలోని లెప్రసీ కాలనీలో ఉపాధి హామీ పథకం ద్వారా మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ట్రైనీ కలెక్టర్ వినూత్న హాజరై మొక్కలు నాటి నీరు పోశారు. కార్యక్రమంలో అడిషనల్ డీఎంహెచ్ఓ అనుపమ జేమ్స్, డీఎస్ఎంఓ డాక్టర్ గంగాధర్ రెడ్డి. డీపీఎంఓ నాగన్న, ఎంపీడీఓ కుళ్లాయిస్వామి, ఏపీఓ తులసీ ప్రసాద్, హెల్త్ సూపర్‌వైజర్ రవీంద్ర పాల్గొన్నారు.



పార్టీ నాయకులతో కలసి పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే మెట్టు

దుర్మార్గ పాలనపై వైఎస్సార్‌సీపీ పోరుబాట

- మాజీ ఎమ్మెల్యే మెట్టు ఆధ్వర్యంలో యువత పోరు పోస్టర్ల ఆవిష్కరణ

రాయదుర్గం: ఆచరణకు సాధ్యంకాని హామీలతో గద్దెనెక్కిన కూటమి ప్రభుత్వం.. అన్ని వర్గాల వారినీ దగా చేసిందని వైఎస్సార్‌సీపీ సమన్వయ కర్త, మాజీ ఎమ్మెల్యే మెట్టు గోవిందరెడ్డి విమర్శించారు. సోమవారం పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మెట్టు గోవిందరెడ్డి మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ నెల 12న జిల్లా కేంద్రంలో విద్యార్థులు, నిరుద్యోగ యువతీ, యువకులతో తలపెట్టిన వైఎస్సార్‌సీపీ యువతపోరును విజయవంతం చేద్దామని పిలుపునిచ్చారు. సార్వత్రిక ఎన్నికలకు ముందు అలవిగాని హామీలిచ్చి విద్యార్థులు, నిరుద్యోగుల జీవితాలతో చెలగాట మాడుతున్న చంద్రబాబు కళ్లు తెరిపించేందుకు యువతీ, యువకులు సిద్ధం కావాలన్నారు. రాష్ట్రంలో రూ.3,900 కోట్లు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలుంటే ఈ బడ్జెట్‌లో కేవలం రూ.2,600 కోట్లు మాత్రమే కేటాయించడం దుర్మార్గమని మండిపడ్డారు. పేద విద్యార్థుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ ఫీజు రీయింబర్స్ మెంట్ పథకాన్ని అమలులోకి తెస్తే.. 2014–19 మధ్య కాలంలో అధికారం చేపట్టిన చంద్రబాబు నిర్వీర్యం చేశారన్నారు. 2019లో వైఎస్ జగన్ మళ్లీ దాన్ని చక్కదిద్దేలా కృషి చేశారని గుర్తు చేశారు. మళ్లీ అదే కుట్ర కూటమి సర్కార్ చేస్తోందన్నారు. సూపర్‌సిక్స్ లేదు.. సూపర్‌సెవెన్ లేదన్నారు. అధికారం చేపట్టగానే 20 లక్షల ఉద్యోగులు, ప్రతి నెలా నిరుద్యోగులకు రూ.3 వేలు భృతి ఇస్తామని చెప్పి మాటతప్పారన్నారు.

ప్రతి హామీ నెరవేర్చాల్సిందే..

వైఎస్సార్‌సీపీ హయాంలో రూ.8 వేల కోట్లతో 17 మెడికల్ కళాలలకు శ్రీకారం చుట్టి, అందులో ఐదు నిర్మాణాలు పూర్తి చేసినట్లు మెట్టు గుర్తు చేశారు. మిగిలిన వాటిని పూర్తి చేయాల్సిందిపోయి మెడికల్ సీట్లు వద్దని కేంద్రానికి లేఖ రాయడం దుర్మార్గమన్నారు. ఈ ప్రభుత్వం ఇచ్చిన ప్రతి హామీ నెరవేర్చేవరకూ వదిలి పెట్టేది లేదన్నారు. అనంతరం యువత పోరు పోస్టర్లను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప, జెడ్పీటీసీ హాన్నే మల్లికార్జున, ఎస్టీసెల్ రాష్ట్ర కార్యదర్శి బోజరాజ్ నాయక్, పట్టణ, మండల కన్వీనర్లు మేకల శ్రీనివాసులు, గౌని లక్ష్మీకాంతారెడ్డి, రాయంపల్లి రామాంజనేయులు, బ్రహ్మానందారెడ్డి, ఆర్ రామాంజనేయులు, పీ రవీంద్రనాథ్‌రెడ్డి, మహిళా అధ్యక్షురాలు కోకూర్తి ఉషారాణి, రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి గరుడుచేడు రాజగోపాల్‌రెడ్డి, బీసీసెల్ అధ్యక్షులు తొండె వెంకటేశులు, జిల్లా ఉపాధ్యక్షులు మారన్న, ఎస్సీసెల్ తాలూక అధ్యక్షుడు బేలోడు రామాంజనేయులు, నాయకులు ఎరగుంట కేశవరెడ్డి, కోకూర్తి జయరామిరెడ్డి, ఆలూరు చిక్కన్న, దిలవర్ బాష, సుదర్శనరెడ్డి, నాగిరెడ్డి, శివారెడ్డి, వన్నూరప్ప, పట్టణ కౌన్సిలర్లు, సర్పంచులు, ఎంపీటీసీలు, పార్టీ ముఖ్యనాయకులు పాల్గొన్నారు.

విద్యావ్యవస్థను భ్రష్టు పట్టించిన కూటమి

- 12న యువత పోరు ర్యాలీని జయప్రదం చేయండి
- పోస్టర్లను విడుదల చేసిన మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి



పోస్టర్లను విడుదల చేస్తున్న మాజీ ఎమ్మెల్యే విశ్వ, పార్టీ నాయకులు

ఉరవకొండ: విద్యావ్యవస్థను భ్రష్టు పట్టించి, ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని అటెక్కికించిన ఘనత కూటమి ప్రభుత్వానిదే అని మాజీ ఎమ్మెల్యే, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వై.విశ్వేశ్వరరెడ్డి అన్నారు. సోమవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఈనెల 12న జిల్లా కేంద్రంలో జరగనున్న యువత పోరు పోస్టర్లను పార్టీ శ్రేణులతో కలిసి ఆయన విడుదల చేశారు. విశ్వ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం విద్యార్థి, యువతకు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా నిర్లక్ష్యం చేస్తోందన్నారు. ఐదు విడతలుగా రీయింబర్స్‌మెంట్ చెల్లించకుండా సీఎం చంద్రబాబు కాలయాపన చేస్తున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ హయాంలో రూ.18 వేల కోట్లు విద్యాదీవెన, వసతి దీవెన కింద వైఎస్ జగన్ వెచ్చించారన్నారు. రాష్ట్రంలో కేవలం 11 మెడికల్ కళాశాలలు ఉంటే వైఎస్ జగన్ సీఎం అయిన తర్వాత రికార్డు స్థాయిలో 17 మెడికల్ కళాశాలలు ప్రారంభించారన్నారు. కూటమి ప్రభుత్వం వైఎస్ జగన్ ప్రారంభించిన మెడికల్ కళాశాలల నిర్మాణం నిలిపివేసి, మంజూరయిన సీట్లను కూడా రద్దు చేయాలని కేంద్రానికి లేఖ రాయడం దుర్మార్గమన్నారు.

సంపద సృష్టి అంటే.. అప్పులు సృష్టేనా..?

తల్లికి వందనం కింద కేవలం రూ.7,500 కోట్లు మాత్రమే బడ్జెట్‌లో కేటాయించి, మోసగించారని విశ్వ అన్నారు. 20 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని, నిరుద్యోగులకు రూ.3 వేల భృతి ఇస్తామని హామీ ఇచ్చి నేటికీ పట్టించుకోలేదన్నారు. చంద్రబాబు సంపద సృష్టి అంటే అప్పులు రికార్డు స్థాయిలో సృష్టించడమేనా అని ఎద్దేవా చేశారు. ఈనె 12న పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని మండల కేంద్రాల్లో పార్టీ నాయకులు జెండాలు ఆవిష్కరించి వేడుకలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్, మాజీ ఎంపీపీ ఏసీ ఎర్రిస్వామి, ఎస్సీసెల్ రాష్ట్ర నాయకులు బసవరాజు, పార్టీ పట్టణ, రూరల్ కన్వీనర్లు ఈడిగ ప్రసాద్, ఎర్రిస్వామిరెడ్డి, మూలగిరిపల్లి ఓబన్న, వైఎస్సార్ స్టూడెంట్ యూనియన్ రాష్ట్ర నాయకులు నవీన్‌రెడ్డి, యువజన విభాగం నాయకులు ఆమిద్యాల రాజేష్, చాబాల జగదీష్, సుద్దాల వెంకటేష్, జోగివెంకటేష్, వశికేరిమల్లి, ఆసీఫ్, కపట్రాళ్ల బషీర్, లత్తవరం గోవిందు, పచ్చిరవి, ఎంపీటీసీ ఈశ్వర్, ధనంజయ, నాగరాజు, సిద్ధూ, కమ్మటిరామాంజినేయులు, భీమ, లాయర్ శ్రీనివాసులు, అమర్నాథ్, శర్మాస్ తదిరతులు పాల్గొన్నారు.

చంద్రమౌళీశ్వరస్వామిని దర్శించుకున్న విశ్వ



పీఠాధిపతిని సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్యే విశ్వ

ఉరవకొండ: గవిమఠం చంద్రమౌళీశ్వర స్వామిని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి సోమవా రం దర్శించుకున్నారు. గవిమఠం బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామిని దర్శించుకొని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గవిమఠం 8వ పీఠాధిపతి జగద్గురు చెన్నబసవరాజేంద్రస్వామిని పార్టీ నాయకులతో కలిసి సన్మానించి, ఆయన ఆశీస్సులు పొందారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు అశోక్, ఈడిగ ప్రసాద్, బసవరాజు, ఎర్రిస్వామిరెడ్డి, ఏసీ ఎర్రిస్వామి, కొలేగుండ్ల శేఖర్, ఓబన్న, భీమ, హనమంతు, వేమన్న, చిదంబరి తదితరులు పాల్గొన్నారు.

జ్యూస్ బండి పెట్టకుండా చర్యలు తీసుకోండి

వజ్రకరూరు: మెయిన్‌బజార్‌లోని దుర్గాదేవి ఆలయం వద్ద ఆలయానికి అడ్డంగా జ్యూస్ బండి పెట్టకుండా చర్యలు తీసుకోవాలని భక్తులు లక్ష్మీదేవి, శ్రీనివాసులు, గోవిందు,శివ కోరారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ నయాజ్ అహమ్మద్, గ్రామ కార్యదర్శి మల్లయ్యకు వినతిపత్రం అందించారు.

'మున్సిపల్ చైర్‌పర్సన్ మార్పు ఉండదు'

రాయదుర్గం: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప పదవీ కాలం పూర్తయ్యే వరకు కొనసాగుతారని పార్టీ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మెట్టు గోవిందరెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప మార్పుపై ఇటీవల పత్రికలు, సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతుండడంపై ఆయన క్లారిటీ ఇచ్చారు. అధినేత జగన్ ఆదేశాల మేరకు చైర్‌పర్సన్ మార్పు ఉండబోదని స్పష్టం చేశారు. పార్టీలోని కౌన్సిలర్లంతా కట్టుబడి ఉండాలన్నారు. కౌన్సిలర్ల మధ్య చిచ్చులు పెట్టాలని, గ్రూపులుగా మార్చాలని కొందరు కుట్ర పన్నుతున్నారన్నారు. అలాంటి వారి ఉచ్చులో ఎవరూ పడొద్దని సూచించారు. పార్టీ సింబల్‌పై గెలిచిన ప్రతి కౌన్సిలర్‌కు అండగా ఉంటానని, ఏ సమస్య వచ్చినా పరిష్కరించే బాధ్యత తీసుకుంటానని చెప్పారు. అందర్నీ సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళ్లేలా కృషి చేస్తామన్నారు.

నువ్వులతో జంబుకేశ్వరస్వామి అలంకరణ



రాయదుర్గంటౌన్: కోటలో వెలసిన స్వయంభూ జంబుకేశ్వరస్వామికి సోమవారం విశేష పూజలు జరిగాయి. తెల్ల, నల్ల నువ్వులతో చేసిన ప్రత్యేక అలంకరణ భక్తులను ఆకట్టుకుంది. అర్చకులు రామకృష్ణస్వామి ఆధ్వర్యంలో స్వామికి పంచామృతాభిషేకం, ఏకబిల రుద్రాభిషేకం, కుంకుమ అర్చన చేశారు.

ఉపచరిత కుంట ఆక్రమణను అడ్డుకోండి

రాయదుర్గంటౌన్: పురాతన కోటలో వెలసిన జంబుకేశ్వర స్వామి, ప్రసన్న వేంకటరమణస్వామి ఆలయ పూజ కైంకర్యం కోసం వినియోగించే ఉపచరితకుంట ఆక్రమణకు గురికాకుండా చర్యలు చేపట్టాలని వీహెచ్‌పీ డిమాండ్ చేసింది. ఈ మేరకు తహసీల్దార్ నాగరాజుకు వీహెచ్‌పీ అధ్యక్షుడు రాజేష్ సోమవారం విన్నవించాడు. కార్యక్రమంలో వీహెచ్‌పీ నాయకులు సత్యనారాయణ, మల్లికార్జున, నగేష్ పాల్గొన్నారు.

అన్యాక్రాంతమైన స్థలం స్వాధీనం చేసుకోండి

బొమ్మనహాళ్: మండలంలోని ఉద్దేహాళ్ గ్రామంలో గ్రంథాలయం పక్కన రూ.50 లక్షల విలువజేసే స్థలం అన్యాక్రాంతమవుతోందని మాజీ సర్పంచ్ మారుతిప్రసాద్ సోమవారం తహసీల్దార్ మునివేలు, ఈఓపీఆర్‌డీ దాస్‌కు ఫిర్యాదు చేశారు. గ్రామంలో రాజకీయ పలుకుబడితో విలువైన స్థలాలను ఆక్రమించుకున్నారని వినతిపత్రంలో తెలిపారు.

రోగులతో బాధ్యతాయుతంగా ప్రవర్తించాలి

విడపనకల్లు: హాస్పిటల్‌కు చికిత్స కోసం వచ్చిన రోగులతో వైద్య సిబ్బంది బాధ్యతాయుతంగా ప్రవర్తించాలని మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ కోదండరామిరెడ్డి అన్నారు. సోమవారం విడపనకల్లు పీహెచ్‌సీని మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ కోదండరామిరెడ్డి తనిఖీ చేశారు. కార్యక్రమంలో పార్మసిస్టు సరళ,ల్యాబ్ టెక్నీషియన్ నూర్ బాష పాల్గొన్నారు.

చెత్తతో సంపద తయారీపై అవగాహన

కూడేరు: చెత్తను వృథాగా పడేయొద్దని, చెత్తతో సంపద తయారీ చేయొచ్చని స్వచ్ఛ భారత్ జిల్లా కో ఆర్డినేటర్ సౌజన్య ప్రజలకు సూచించారు. సోమవారం మండల కేంద్రంలో చెత్తతో సంపద తయారీపై ప్రజలకు పంచాయతీ అధికారులు అవగాహన కల్పించారు. జిల్లా కోఆర్డినేటర్ సౌజన్య మాట్లాడుతూ చెత్తను డస్ట్‌బిన్‌లో వేసి ఉంచితే పారిశుద్య కార్మికులు రోజూ ఇంటింటికీ వచ్చి సేకరిస్తారని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రమాదేవి, మహిళా పోలీసులు వెంకటరమణమ్మ, పుష్పా, ఇంజనీరింగ్ అసిస్టెంట్ హరి, కార్మికులు పాల్గొన్నారు.

గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ

శెట్టూరు: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య పరీక్షల కోసం వచ్చిన గర్భిణులకు హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు పౌష్టికాహారం అందించారు. సోమవారం డాక్టర్ తరుణ సాయి చేతుల మీదుగా పోషకాలతోకూడిన ఆహారం 40 మంది గర్భిణులకు అందించారు.

ఉరవకొండ: రాకెట్ల పీహెచ్‌సీలో గర్భిణులకు అనంతపురానికి చెందిన బేల్ ఇన్‌ఫ్రా ప్రాజెక్టు ఎండీ రాకెట్ల రమేష్, చంద్రశేఖర్ సోమవారం పౌష్టికాహారం అందించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి వెంకటేష్‌నాయక్, పెన్నహోబిలం ఆలయ మాజీ చైర్మన్ అశోక్, సర్పంచ్ నాగరాజు పౌష్టికాహారం అందించారు.

సంక్షిప్త సమాచారం

విద్యార్థులకు నాసిరకం భోజనం

బొమ్మనహాళ్: విద్యార్థులకు నాసిరకం భోజనం వడ్డిస్తున్నారని పీడీఎస్‌యూ నాయకులు అన్నారు. సోమవారం సింగానహళ్లిలోని ప్రాథమిక, ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని వారు పరిశీలించారు. జిల్లా ఉపాధ్యక్షులు మల్లెల, కణేకల్లు మండల అధ్యక్షులు ఫకృద్దీన్ మాట్లాడుతూ రెండు పాత్రలు అన్నం వండడంపై వంట ఏజెన్సీ నిర్వాహకులను ప్రశ్నించినట్లు తెలిపారు. అయితే ఒక పాత్రలో విద్యార్థులకు , మరో పాత్రలో ఉపాధ్యాయులకు విడివిడిగా వండినట్లు తెలిపారన్నారు. విద్యార్థులు తినే అన్నం ముద్దగా ఉందని విమర్శించారు. కార్యక్రమంలో యూనియన్ కార్యదర్శి మహేంద్ర, గంగరాజు, ఆనంద్, సర్మాస్ పాల్గొన్నారు.

ఇఫ్తార్ ఇవ్వడం పుణ్యఫలం



రాయదుర్గం: ఇఫ్తార్ విందులో పాల్గొన్న ముస్లింలు

రాయదుర్గంటౌన్: రంజాన్ మాసంలో దీక్షాపరులకు ఇఫ్తార్ ఇవ్వడం పుణ్యఫలమని మక్కా మసీదు ఇమాం ముఫ్తీ నూర్ మహమ్మద్ తెలిపారు. ఓబుళాచారి రోడ్డులోని మక్కా మసీదులో సోమవారం సాయంత్రం ఇఫ్తార్ విందు ఇచ్చారు. సాయంత్రం ఉపవాస దీక్ష విరమించి మగ్‌రిబ్ నమాజ్ అనంతరం ముస్లింలు ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు.

సావిత్రిబాయి పూలే వర్ధంతి

ఉరవకొండ: స్థానిక గాంధీ హరిజన హాస్టల్ ఆవరణలో సావిత్రిబాయి పూలే వర్ధంతి కార్యక్రమం సోమవారం నిర్వహించారు. గిరిజన హక్కుల సాధన సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మీనుగ గోపాల్, జీవీఎస్ఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సాకే పురుషోత్తం, చాబాల సర్పంచ్ జగదీష్, సాకే రమేష్‌బాబు, హ్యూమన్‌రైట్స్ కన్వీనర్ లాలుసాహెబ్, ఫద్వీరాజ్, రామాంజనేయులు, ఆనంద్‌కుమార్ పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం రూరల్: సావిత్రిబాయి పూలే ఆశయాలను కొనసాగిద్దామని ప్రధానోపాధ్యాయులు విశ్వనాథ్ తెలిపారు. సోమవారం మున్సిపాలిటీ పరిధిలోని దొడగట్ట ప్రాథమికోన్నత పాఠశాలలో సావిత్రిబాయి పూలే వర్ధంతి నిర్వహించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

బ్రహ్మసముద్రం: గొంచిరెడ్డిపల్లి గ్రామం సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. కళ్యాణదుర్గం నుంచి ప్రశాంత్ అనే యువకుడు ద్విచక్రవాహనంపై బ్రహ్మసముద్రం వైపు వెళ్తున్నాడు. అదే సమయంలో నాగిరెడ్డిపల్లికి చెందిన చెన్నకేశవులు కళ్యాణదుర్గం వైపు వెళ్తున్నాడు. ఎదురెదురుగా ద్విచక్రవాహనాలు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఇద్దరికీ గాయాలయ్యాయి. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

నివాళి

విడపనకల్లు: హావళిగికి చెందిన వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి భరత్‌రెడ్డి పెద్దమ్మ సులోచనమ్మ (80) సోమవారం మృతి చెందారు. మాజీ ఎమ్మెల్యే, సమన్వయకర్త వై.విశ్వేశ్వరరెడ్డి, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు సీపీ వీరన్న, శ్రీనివాసరెడ్డి, గోపాల్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు సులోచనమ్మ మృతదేహానికి నివాళులర్పించారు. తిమ్మారెడ్డి కుటుంబ సభ్యులను విశ్వేశ్వరరెడ్డి పరామర్శించారు.

వినతుల వెల్లువ

కూడేరు: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భూమి, ఇతర సమస్యలపై వినతులు వెల్లువెత్తాయి. శిక్షణ కలెక్టర్ వినూత్న ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో హౌసింగ్ డీఈ హనుమప్ప, ఎంపీడీఓ కుళ్లాయిస్వామి, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ నాగదివ్య, పశు వైద్యాధికారి శ్వేత, ఏపీఎం దేవానంద ఫిలిప్సన్, ఏపీఓ తులసి ప్రసాద్, ఏసీడీపీఓ ఎల్లమ్మ, సీఎస్‌డీటీ లక్ష్మీదేవి, హెల్త్ సూపర్ వైజర్ రవీంద్ర పాల్గొన్నారు.

రాయదుర్గంటౌన్: మున్సిపల్ కార్యాలయంలో ప్రతి సోమవారం జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఒకే వినతి అందింది.